అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 03 ఫిబ్రవరి 2026 | పేజీలు : 04

ఏపీకి నిధుల క్రెడిట్ సీఎం చంద్రబాబుదే

- తరచూ ఢిల్లీ వెళ్లి నిధులు రాబట్టిన సీఎం చంద్రబాబు
- షీ మార్ట్ ఏర్పాటుతో గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పన
- కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ప్రాధాన్యం చేనేత, జౌళి రంగానికి ఎంతో మేలు
- జిల్లాకో బాలికా హాస్టల్ ఏర్పాటు నిర్ణయంపై మంత్రి సవిత హర్షం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త)

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో ఏపీకి ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయింపు క్రెడిట్ అంతా సీఎం చంద్ర బాబుదేనని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. బడ్జెట్ లో ఏపీకి ప్రాధాన్యంపై తరుచూ ఢిల్లీ వెళ్లి పీఎం నరేంద్రమోడిని, ఇతర కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి నిధులు రాబట్టారన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికీ అనుకూలమైనదని కొనియాడారు. ముఖ్యంగా ఉద్యోగులకు ఆదాయ పన్ను శాతం స్లాబ్ రేటు పెంపుదల ఎంతో మేలు కలుగుతోందన్నారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తొమ్మిదో పర్యాయం బడ్జెట్ ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. బడ్జెట్ లో బాలికా విద్యకు, వ్యవసాయానికి, చేనేత, జౌళి రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ప్రతి జిల్లాలోనూ బాలికా హాస్టల్ ఏర్పాటు చేయడానికి కేంద్రం నిర్ణయించడంపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. ఈ హాస్టల్ ఏర్పాటుతో బాలికా విద్యాభివృద్ధికి

మిగతా 2లో...

ప్రజల్లో కుల విభేదాలు రెచ్చగొట్టడమే వైసీపీ నాయకుల అజెండా

విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

కళ్యాణదుర్గం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

ప్రజల్లో కులాల మధ్య చిచ్చు పెట్టి, ప్రభుత్వంపై నిందలు మోపడమే వైసీపీ నాయకుల ప్రధాన పనిగా మారిందని, అలాంటి నాయకులనే వైఎస్ జగన్ రెడ్డి తన చుట్టూ కోటరీగా ఏర్పాటు చేసుకుని ఈ నీచ రాజకీయ సంస్కృతికి తెరలేపారని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. నేడు కళ్యాణదుర్గం ప్రజావేదికలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైసీపీ నాయకులు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడలేని స్థితిలో ఉండి కేవలం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

తిరుమల లడ్డు వివాదం పేరుతో దారి మళ్లింపు ప్రయత్నం:

వైసీపీ హయాంలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులకు ప్రసాదంగా అందించే లడ్డు తయారీలో ఆవునెయ్యి స్థానంలో కల్తీ జరిగిందని సీబీఐ, సిట్ స్పష్టంగా పేర్కొన్న తర్వాత కూడా దాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ విషయంపై సమాధానం చెప్పలేని వైసీపీ నేతలు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని, ఆయన కుటుంబ సభ్యులను నీచమైన భాషలో విమర్శించే స్థాయికి దిగజారారని మండిపడ్డారు. అంబటి రాంబాబు లాంటి వ్యక్తులను సమర్థించడమే కాకుండా, మొన్నటి వరకు జైలులో ఉండి వచ్చిన జోగి రమేష్ చేత కూడా అదే భాషలో మాట్లాడించడం చూస్తే జగన్ రెడ్డి తన చుట్టూ కనీస మర్యాదలు, విలువలు తెలియని వారిని కోటరీగా పెట్టుకున్నారని స్పష్టమవుతోందన్నారు.

చదువు కాదు - గుణం ముఖ్యం

ఉన్నత చదువు కన్నా ఉన్నతమైన గుణం ముఖ్యం" అని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు చివరి దాకా ప్రజలకు మంచి చేసి మంచి పేరు సంపాదించు కోవడమే అసలైన విలువ అని అన్నారు. వాల్మీకి వర్గానికి చెందిన కాలువ శ్రీనివాసులు ఈ ప్రాంత అభివృద్ధి, ప్రాజెక్టుల కోసం పనిచేస్తుంటే, ఇక్కడ రంగయ్య మాత్రం అం దుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత

గత ఐదేళ్లలో మహిళలు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి ఉండేదని, కానీ నేడు పట్టాభి రాముడి బ్రహ్మోత్సవాలకు మహిళలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారంటే కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఎంత భద్రత ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రైతుల అభివృద్ధికి సంపూర్ణ మద్దతు కళ్యాణదుర్గం ప్రాంతంలో రైతులు బంగారు పంటలు పండిస్తున్నారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ అనుబంధ పరికరాలు ఏవి కావాలన్నా మంజూరు చేస్తామని మంత్రి అచ్చం నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా వెంటనే ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు తాగు నీరు, సాగు నీరు అందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే అమిలినేని స్పష్టం చేశారు.

రాంజీ పథకానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గం

- మోడీకి మద్దతు ఇవ్వడానికి మీకు సిగ్గు ఉండాలి
- బిజెపి వచ్చాక ఉపాధిహామీ పథకం ఊపిరి తీశారు
- కాంగ్రెస్ హయాంలోనే ఉపాధిహామీ భాగా నడిచింది
- రాంజీ పథకం దిక్కుమాలిన పథకం
- ఉపాధిహామీ పథకం కోసం ప్రజలు ఉద్యమించాలి
- ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల

ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నేతలు

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి ఊపిరి తీసింది. ఉపాధిహామీ పథకం స్థానంలో బిజెపి అమల్లోకి తెచ్చిన రాంజీ చట్టంతో కూలీలకు పని దొరకదని గ్రామాల్లో మళ్లీ వలసలు పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కోసం ప్రజలు ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రాంజీ పథకానికి చంద్ర బాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గం రాష్ట్రం నెత్తిన భారం వేసే రాంజీ పథకానికి మీరు ఎందుకు మద్దతు ఇస్తు న్నారని ఆమె ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో మండ్రేగా పరిరక్షణ యాత్రను సోమవారం సాయంత్రం ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ప్రారంభించారు. 20 ఏళ్ల క్రితం 2006 సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదిన ఇదే బండ్లపల్లి గ్రామ వేదికగా లాంఛనంగా ప్రారంభమైన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అప్పట్లో దేశ వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆనాడు బండ్లపల్లి వేదికగా ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసిన శిలాఫలకాన్ని కాంగ్రెస్ అధ్యక్షు రాలు షర్మిల పరిశీలించి శ్రామికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిలారెడ్డి మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2006 ఫిబ్రవరి 2వ తేదిన ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ పథకాన్ని సోనియాగాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేతులు మీదుగా ప్రారంభమైంది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఏం కావాలో అన్ని పథకాలు అమలు చేశారు. అందులో భాగంగా కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా నుంచే దేశంలో తొలిసారిగా ఉపాధిహామీ పథకం అమలు చేసిన ఘనత వైఎస్.రాజశేఖర్‌రెడ్డిదే అన్నారు. కాంగ్రెస్ అధికారంలో

మిగతా 2లో...

భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- రెవెన్యూ క్లినిక్స్ ద్వారా శాశ్వత పరిష్కారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

సమస్య పరిష్కారం కావడంతో ఉత్తర్వులు అందుకున్న కాలనీవాసులతో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ దృశ్యం

శ్రీ సత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త ప్రతినిధి:

భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తూ రెవెన్యూ క్లినిక్స్ ద్వారా శాశ్వత పరిష్కారం అందిస్తోందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు "రెవిన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమం చేయడం జరుగుతుంది. మిగతా వారాల్లో ఆయా డివిజన్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుంది. ప్రత్యేకంగా ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమంలో తహశీల్దార్ లు, ఆర్డీవో ఒకే చోట ఉండి, రికార్డులన్నింటిని సిద్ధంగా ఉంచుకొని అర్జీ దారుడి ఎదుటే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అడంగల్ లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎఫ్టైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూముల సమస్యలు, రస్తా, స్మశాన వాటికల సమస్యలు, అలాగే జిల్లాలోని వివిధ మండలాల నుంచి అందిన భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పెనుకొండ డివిజన్, పరిగి మండలం, పరిగి గ్రామంలోని ప్రశాంతి నగర్ కాలనీలో భూములకు సంబంధించి సర్వే నంబరు 294లోని 1.65 ఎకరాల భూమి 2018లో సెక్షన్ 22తి నిషేధ జాబితాలో నమోదు కావడంతో, ప్రభుత్వ ఉర్దూ స్కూల్‌కు చెందిన 0.11 సెంట్ల భూమిని సబ్ డివిజన్ చేసి, కాలనీ వాసులకు సంబంధించిన మిగిలిన సర్వే నంబరు 2941తీ2 (విస్తీర్ణం 1.54 ఎకరాలు)ను సెక్షన్ 22తి నిషేధ జాబితా నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న ప్రశాంతి నగర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ ఏడేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపిన జిల్లా కలెక్టర్ కి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం మోర్య భరద్వాజ్, డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనందకుమార్, మండల తాసిల్దారులు, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొందలవాడలో భయం..భయం..

ముగ్గురిపై చిరుతపులి దాడి..

చిరుత దాడిలో గాయపడిన నాయుడు, లక్ష్మిదేవి

ప్రజలను అప్రమత్తం చేస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామంలో సోమవారం చిరుతపులి దాడిచేసి ముగ్గురిని గాయపర్చిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. బొందల వాడ గ్రామానికి చెందిన కోనంకి నాయుడు, లక్ష్మిదేవి, అంకె నారాయణస్వామి అనే వ్యక్తులపై చిరుతపులి దాడి చేయడంతో వారు గాయపడ్డారు. ఈ సంఘటనతో ఒంటరిగా ఎవరు పొలాలకు వెళ్లరాదని కట్టెలు, కటార్లు తీసుకునే బయటకు వెళ్లాలని బొందలవాడలో అధికారులు చాటింపు వేశారు. చిరుతపులి దాడికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పొలానికి పురుగుల మందు పిచికారి చేయడానికి పొలం వద్దకు వెళ్లిన కోనంకి నాయుడుపై చిరుతపులి దాడి చేయడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా గ్రామంలో ఇంటి పనులు చేస్తుండగా వెనకాల నుంచి చిరుత లక్ష్మిదేవిపై దాడి చేసింది.

ఈ విధంగా బొందల వాడ గ్రామంలో ముగ్గురిపై చిరుత దాడి చేయడంతో అటవిశాఖ అధికారులు గ్రామంలోకి వచ్చి అందరు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. చిరుతలు సంచరించిన వాటి అడుగుజాడలను పరిశీలించి చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోకి వచ్చిన చిరుతలు బయటకు వెళ్లే వరకు పొలాల వద్దకు వెళ్లవద్దంటూ బొందల వాడ విఆర్ఓ దాదాపీర్, కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ గ్రామస్తులను అప్రమత్తం చేయడం కనిపించింది.

మార్పు చేస్తే... మనీ ఇవ్వాల్సిందే..!

- కాసారాల నిర్మాణాలు.. ట్రాన్స్‌కో అధికారులకు కాసుల వరాలు
- రూ 6000 నుంచి రూ.8000 వసూలు దండా

వినియోగదారుల ఇంటిముందు మార్పు చేసిన కాసారాలు1

ధర్మవరం రూరల్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

పేదల కాలనీలో ఇష్టారాజ్యంగా ట్రాన్స్కో అధికారులు సొమ్ము వసూలు చేసి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పనులు చేస్తున్నారు. ఇంటి ముందు కరెంటు తీగలు తగకుండా కాసారం మార్పు చేస్తే... ట్రాన్స్కో అధికారులకు మనీ చెల్లించాల్సిందే.. అంటూ కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారులు వేసి న విద్యుత్ తీగలు పక్కకు మళ్ళించడానికి ఒక్కొక్క కాసారానికి రూ.6000 నుంచి రూ.8వేలు స్థానిక ట్రాన్స్కో అధికారులు వసూలు దండా కొనసాగిస్తున్నారు. అప్పు చేసి ఇల్లు నిర్మించుకుంటే... మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు... పేదలపై ఆర్థిక బారం మోపుతున్నారు. నిరుపేదలకు కన్నీరు... ట్రాన్స్కో అధికారులకు పన్నీరుగా ఈ తంతు కొనసాగుతుంది. ధర్మవరం పట్టణ శివారున పోతుల నాగేపల్లి రెవెన్యూ పొలములో ఇల్లు లేని పట్టణ వాసులకు సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 6 వేల ఇంటి పట్టాలను నిరుపేదలకు అందించారు. ప్రభుత్వం అందించిన ఇంటి స్థలంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా అందించిన సొమ్ముతో పాటు సొంత నిధులతో సుమారు 70 శాతం నుండి 80 వరకు ఇల్లు నిర్మాణం చేసుకున్నారు. వారికి మౌలిక వసతుల్లో భాగంగా తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగింది... రూ"లక్షలు వెచ్చించి విద్యుత్ వసతి కల్పించారు... పేదలకు అందించిన ఇంటి పట్టాల్లో నిర్మాణం చేసిన లబ్ధిదారులకు రూ. లక్షలు వ్యయంతో విద్యుత్ స్తంభాలు, కాసారాలు, ఐదు లైన్లు విద్యుత్ తీగలు, విద్యుత్ నియంత్రికలను టెండర్ విధానములు గుత్తేదారులు ప్రణాళిక బద్ధంగా 30 అడుగులు, 4న్ అడుగుల వెడల్పు కలిగిన రోడ్డు అంచున లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీయగలను లాగారు. .. నిర్మాణాల్లో తేడాలు.... అధికారులకు కాసులు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఒకటిన్నర సెంటు విస్తీర్ణములో ఇంటి పట్టాల్లో గృహ నిర్మాణ సంస్థ సూచించిన మేరకు లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ ఇల్లు నిర్మాణం చేసేటప్పుడు రోడ్డు వైపుకు బాల్కన ముందుకు కట్టడం వల్ల విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం ఉంది. దీన్ని ఆసరాగా తీసుకున్న స్థానిక ట్రాన్స్కో అధికారులు కాసారాలు మార్పు చేస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. ..ఇలా వసూలు చేస్తున్నారు... ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఇంటికి ఆనుకుని ఉన్నాయి. తీగలు తగలకుండా కాసారం వేసి మార్పు చేయాలని స్థానిక ట్రాన్స్కో అధికారులను కోరడంతో.... ఇదే అదునుగా భావించిన ఆ అధికారులు విద్యుత్ తీగలు మార్పు కోసం కాసారానికి రూ. 6000 నుంచి రూ.8000 వరకు వసూలు చేస్తున్నారు. ఆ కాలనీలో 80 నుంచి నూరు వరకు స్తంభాలకు కాసారాలు మార్పు చేసినట్లు తెలుస్తుంది. .. మచ్చుకు కొన్ని.... పోతులనాగేపల్లి కాలనీలోని విద్యుత్ స్తంభం 492, 358,356,725, 583,581,692, 691 లకు కాసారాలు మార్పు చేసి తీయగలను పక్కకు లాగారు. ఈ లెక్కన ట్రాన్స్కో అధికారులు రూ లక్షల సొమ్మును పిండేసినట్లు తెలుస్తుంది.. ఆ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయి.

కేటాయించిన లక్ష్యం మేరకు ఉపాధి పనులను చేపట్టాలి

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ ఫిబ్రవరి 02 ప్రభాతవార్త

ఉపాధి హామీ పనులను కేటాయించిన లక్ష్యం మేరకు చేపట్టాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణు చరణ్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక జిఎస్డబ్ల్యుఎస్, ఉపాధి హామీ, పట్టాదారు పాసుపుస్తకాలు, పీఎం సూర్యఘర్ యోజన, ఏపిఎంఐపి, హౌసింగ్, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఎపిడిలు, ఎపిఓలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద డైలీ లేబర్ టర్నవుట్ మరింత పెంచాలన్నారు. ఉపాధి పనులను

మిగతా 2లో...

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా ప్రశ్నించలేని చంద్రబాబు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విమర్శ

అనంతపురం సిటీ.ఫిబ్రవరి 2.ప్రభాతవార్త

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగేనా ప్రశ్నించలేని స్థితిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బడ్జెట్ లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసి ప్రజల బతుకులతో కేంద్రం ఆటలాడుతోందని విమర్శించారు. వ్యవసాయ బడ్జెట్ లో దాదాపు ఎరువుల సబ్సిడీకే రూ.16 వేల కోట్ల కత్తెర వేశారని ఇది రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అలాగే రైతులకు కనీస మద్దతు ధర ప్రస్తావనే లేదని ఫసల్ బీమాకు డబ్బులు పెరగాల్సింది పోయి రూ.14,473 నుంచి రూ.12,200కు తగ్గించేశారన్నారు. కోకో, జీడిపప్పు వంటి హైవ్యాల్యూ ఉత్పత్తుల పరిశోధనలకు మాత్రమే నిధులిచ్చారని ఎగుమతులకు రూ.350 కోట్లు, నమో డ్రోన్లకు రూ.676 కోట్లు ఇచ్చి, సాధారణ రైతుల్ని మాత్రం విస్మరించారని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో రూ.58 వేల కోట్లు కోత విధించారని, గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం హక్కుగా వచ్చిందని దీని వల్లే కరోనా టైంలో తల్లీ బిడ్డా బతికారన్నారు. చంద్రబాబు డబ్బాలు కొట్టుకున్న అమరావతి రైలుకు సైతం మొండిచేయే చూపారని విశాఖ రైల్వే జోన్ గురించి బడ్జెట్లో అస్సలు ప్రస్తావనే లేదన్నారు. చంద్ర బాబును రాష్ట్రం గురించి ఆలోచించమని అడగడం కూడా అత్యాశే అవుతుందని అయినా ఆలోచించమని కోరుతున్నా మన్నారు. మీకున్న గంపెడు ఎంపీల్ని తీసుకెళ్లి బడ్జెట్‌లో న్యాయం

మిగతా 2లో...

గత కొన్నేళ్లుగా కేటాయించిన నీరు కూడా వదలడం లేదు

- పీఏబిఆర్ అధికారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో

పీఏబిఆర్ కుడికాలువ పరిధిలోని రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులకు సూచించారు. వారం రోజుల వ్యవధిలో ఆమె పీఏబిఆర్ అధికారులతో 2వ సారి సమావేశమయ్యారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పీఏబిఆర్ ఎస్ఈ, ఏఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు. జలశాయం నుంచి కుడికాలువకు నీరు వదిలి 15రోజులు దాటినా సరైన ప్రవాహం లేదని ఎమ్మెల్యే సునీత అన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. సమావేశంలో అధికారులు కూడా నీటి వేగం పెంచేలా చూస్తామని ఎమ్మెల్యే సునీతకు తెలియజేశారు. మరోవైపు నియోజవర్గంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై పంచాయతీ రాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారిగా ఎన్ని పనులు జరుగుతున్నాయి.. ఎక్కడెక్కడ పెండింగ్, మస్టర్ల సమస్యలు వంటి వాటిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే చేపట్టాలని, కొత్తపనులు చేపట్టడానికి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

గ్రామ కమిటీలే పార్టీకి పునాది

నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

హిందూపురం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



ప్రసంగిస్తున్న వైసీపీ నేత వేణురెడ్డి

పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు

నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం జరిగింది. గ్రామ కమిటీల ఆర్గనైజింగ్ స్టేట్ ఇంచార్జ్ ఇన్చార్జ్ వజ్ర భాస్కర్ రెడ్డి, హిందూపురం నియోజకవర్గ పరిశీలకులు ఫయాజ్ భాష, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి దీపికా వేణు రెడ్డి, మధుమతి రెడ్డి మొదలగువారు ప్రసంగించారు. అందరూ సమన్వయంతో లోపాలు లేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామ కమిటీలను పటిష్టంగా, త్వరితగతిన ఏర్పాటు చేసేలా సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కోరారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అందరికీ సరైన స్థానం లభించేలా కృషి చేయాలన్నారు. భవిష్యత్తు విజయాలకు మార్గం సుగమం చేసేలా పని చేద్దామని అన్నారు. కమిటీల ఏర్పాటు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ టాస్క్‌ను పూర్తి చేయడంలో మన హిందూపురం నియోజకవర్గం ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమ రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకులు ఆసిఫ్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న విజయభారతి

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడండి

హిందూపురం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

సకాలంలో పన్నులు చెల్లించి హిందూపురం పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి ఎం.విజయ భారతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ జాగా పన్నులను వీలైనంత తొందరగా గడువు లోపు చెల్లించాలని సూచించారు.

తేరు చక్రాలు కింద పడి వ్యక్తి దుర్మరణం

డి.హిరెహాళ్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

మృతిచెందిన కురుబ సతీష్(35)

గ్రామ దేవత మలెమ్మ దేవి రథోత్సవం సందర్భంగా ఆదివారం సాయంకాలం తేరు చక్రం కింద పడి సతీష్(35) దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళితే డి.హిరెహాళ్ మండలంలోని వసగుడ్డం గ్రామానికి చెందిన మృతుడు కర్ణాటక ప్రాంతం సండూరు తాలూకా డి.అంతాపురం గ్రామంలో మలేమ్మ దేవి జాతర మహోత్సవంకు స్వగ్రామం నుండి కుటుంబ సమేతంగా ఆ జాతరకు తరలి వెళ్లారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున జన సందోహం మధ్య అమ్మవారి రథోత్సవ ఉత్సవాలు ప్రారంభమై అమ్మవారి తేరు లాగే సమయంలో మృతుడు తేరుకు అతి సమీపంలో ఉండడంతో తేరులాగే సమయంలో ప్రమాద వశాత్తు తేరు చక్రం కింద పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటన గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు హుటాహుటిన చికిత్స కోసం తోరణగల్లు ఆసుపత్రికి తరలించగ చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుడి కి భార్య రూప, కూతురు, కుమారుడు ఉన్నట్లు గ్రామస్థులు, బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై కర్ణాటక పోలీసులు కేసు నమోదుచేసి శవ పంచనామ అనంతరం కర్ణాటక పోలీసులు సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో కుటుంబ సభ్యులు స్వగ్రామం కు తరలించి దహన సంస్కారాలు గావించారు.

కళ్యాణదుర్గంలో ఘనంగా శివ స్వాముల మండల పూజా కార్యక్రమం

కళ్యాణదుర్గం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం పట్టణం శివభక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మోగింది. పట్టణంలో నిర్వహించిన శివ స్వాముల మండల పూజా కార్యక్రమం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం శివభక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. పట్టణంలోని పురాతన బావి బసవేశ్వర ఆలయం ప్రాంగణంలో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి రుద్రాభిషేకం, షోడశోపచార అభిషేకాలు భక్తిపూర్వకంగా నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్య హోమం, లక్ష్మీనారాయణ హోమం, రుద్ర స్వాహాకార హోమం, భ్రమరాంబ అమ్మవారి హోమం వంటి పలు ప్రత్యేక హోమాలు వేదమంత్రాల నడుమ వైభవంగా జరిగాయి. బలి మహాపూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వినియోగం అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం (నారాయణ సేవ) నిర్వహించగా వందలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి పుణ్యఫలాన్ని పొందారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు భక్తుల జయజయధ్వానాల మధ్య కనుల పండువగా సాగి పట్టణమంతా భక్తిమయ వాతావరణాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు పట్టణంలో శాంతి, సౌభాగ్యం, సద్భావనలు వెల్లివిరియడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

అనధికార భవన నిర్మాణాలను క్రమబద్ధీకరణ చేసుకోండి

గుంతకల్లు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో 1985 జనవరి 1 తరువాత గత ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన అనధికార భవన నిర్మాణాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి 31 దాకా ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. అనధికారికంగా నిర్మించిన భవనాలు, మంజూరైన ప్లానుకు భిన్నంగా నిర్మించిన భవనాలు, అనధికార అంతస్తులు, నివాస అనుమతితో నిర్మించి వాణిజ్య అవసరాలకు మార్చుకున్న భవనాలను లైసెన్స్ పొందిన టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టిపి) ద్వారా బీపిఎస్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నేరుగా బీపిఎస్ పోర్టల్ ద్వారా, లేదా సచివాలయంలోని వార్డ్ ప్లానింగ్ రెగ్యులేటరీ సెక్రటరీ ద్వారా గాని ఆన్‌లైన్‌లో కనీస రుసుము 10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏపీకి నిధుల క్రెడిట్ సీఎం చంద్రబాబుదే

మొదటిపేజీ తరువాయి.... ఎంతో మేలు కలుగుతుందన్నారు.రూ.12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపు,స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేల వరకూ పెంపుదలతో ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. సామాన్య ఉద్యోగికి సైతం రూ.60 వేల నుంచి రూ.1లక్ష వరకూ లబ్ధిపొందుతుందన్నారు. గ్రామీణ మహిళల సాధికారతతో పాటు స్థానిక ఉత్పత్తులకు డిమాండ్ కలిగేలా మండల స్థాయిలో షీ మార్ట్స్ ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు.షీ మార్ట్స్ వల్ల గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పనతో ఆర్థిక భరోసా కలుగుతుందని మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు. నిధుల రాక క్రెడిట్ సీఎం చంద్రబాబుదే...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. బడ్జెట్ కు ముందు ఎన్నో పర్యాయాలు ఢిల్లీ వెళ్లి పీఎం నరేంద్రమోడిని, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను, ఇతర కేంద్ర మంత్రులను కలిశారన్నారు. ఆయన కృషి ఫలితమే బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ. 500 కోట్లు, రహదారులు,వంతెనల నిర్మాణానికి రూ.రూ.350 కోట్లు, తాగు, మురుగునీటి నిర్వహణకు రూ.800 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320 కోట్లు, రాజధాని అమరావతికి రూ.1,128.91 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాష్ట్రానికి నిధులు రాబట్టడం వెనుక సీఎం చంద్రబాబు ఎంతో కృషి ఉందని, ఈ క్రెడిట్ అంతా ఆయనదేనని మంత్రి సవిత తెలిపారు. చేనేత, జౌళి రంగానికి ఎంతో మేలుబడ్జెట్ లో చేనేత, జౌళి రంగానికి పెద్దపీట వేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. దేశంలో కొత్తగా మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారన్నారు.మహాత్మాగాంధీ గ్రామ్ స్వరాజ్ పథకంలో భాగంగా ఖాదీ, హ్యాండ్లూమ్ రంగాలను బలోపేతం చేస్తామన్నారన్నారు. దేశ వ్యాప్తంగా మెగా టెక్స్ టైల్స్ పార్కుల ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలో ధర్మవరం, పిఠాపురం, మంగళగిరి పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందనున్నాయన్నారు. వాటితో రాష్ట్రంలో మరిన్ని టెక్స్ టైల్స్ పార్కులు, మెగా క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. చేనేతలకు 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. రాబోయే ఏప్రిల్ ఫస్ట్ నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ అందజేయనున్నామన్నారు. రాయలసీమలో బుల్లెట్ పరుగులురాయలసీమలో బుల్లెట్ ట్రైన్లు పరుగులు తీయనున్నాయని మంత్రి సవిత వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశ వ్యాప్తంగా ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేయనుందని, వాటిలో మూడు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లనున్నాయని తెలిపారు. రాయలసీమలో బుల్లెట్ ట్రైన్లు ఆగేలా దుద్దేబండ, హిందూపురంలో స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందన్నారు. బుల్లెట్ ట్రైన్ల రాకపోకలతో రాయలసీమకు ఎంతో మేలు కలుగుతుందని, యువతకు, ఉద్యోగులకు, వ్యాపారులకు మరింత లబ్ధి కలుగనుందని తెలిపారు. రహదారుల అభివృద్ధిలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో రూ.270 కోట్లతో సోమందేపల్లి తూముకుంట నుంచి నాలుగు రహదారుల లైన్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించిందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని మంత్రి సవిత తెలిపారు.

రాంజీ పథకానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గం

మొదటిపేజీ తరువాయి....ఉన్నప్పుడు ఉపాధిహామీ పథకం బాగా నడిచిందని అప్పట్లో ఉపాధిహామీ పథకం అంటే గ్రామాల్లో పండుగని ఆమె అభిప్రాయ పడ్డారు. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కాంగ్రెస్ అమలు చేసిన ఈ పథకం ఆదర్శంగా నిలిచిందని, ఎన్నో పెద్ద పెద్ద యూనివర్సిటీలు ఈ పథకంపై పరిశోధనలు చేశాయని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఉపాధిహామీ పథకం కింద 100 రోజులు పక్కాగా పని ఉండేదన్నారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకం (మండ్రేగా)ను భ్రష్టు పట్టించిందని ప్రతి యేటా కార్డులు రద్దు చేస్తూ వచ్చిందని ఆమె ఆరోపించారు. గతంలో ఉపాధిహామీ పథకం కింద 100 శాతం వేతనాలు కేంద్ర ప్రభుత్వమే ఇచ్చేదన్నారు. ఇప్పుడు కొత్తగా గ్రాంజీ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, ఈ చట్టంలో 40 శాతం నిధులు రాష్ట్రం పెట్టుకోవాలని నిబంధనలు విధించిందని, ఉపాధిహామీ పథకాన్ని చంపాలని కేంద్రం కుట్రలు చేస్తోందని ఆమె ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం చేబుతున్నట్లు గ్రాంజీ పథకంలో 120 రోజులు అనేది బూటకం అన్నారు. ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రాంజీ పథకానికి సీఎం చంద్రబాబు మద్దతు ఇవ్వడం, దుర్మార్గమని మళ్లీ ఢిల్లీ వెళ్లి నిధులు ఇవ్వాలని అడుగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చే పథకాలకు నిధులు దిక్కులేదని, ఈ పరిస్థితుల్లో కొత్తగా గ్రాంజీ పథకానికి 5వేల కోట్లు ఇస్తారా అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు గ్రాంజీ పథకాన్ని వ్యతిరేకించారని ఇందుకోసం కాంగ్రెస్ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జెడి.శీలం, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.మధుసూధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ముఖ్యులు కోటా సత్యం, దాదాగాంధీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. బండ్లపల్లి గ్రామానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

కేటాయించిన లక్ష్యం మేరకు ఉపాధి పనులను చేపట్టాలి

మొదటిపేజీ తరువాయి.... ఎంపిడిఓలు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలన్నారు. యావరేజ్ వేజ్ 282 రూపాయలు ఉందని, వేజ్ నమోదు పెంచాలన్నారు. లేబర్ బడ్జెట్‌ను లక్ష్యం మేరకు చేరుకోవాలని, 100 రోజుల హౌస్ హోల్డ్ లకు సంబంధించి లక్ష్యం పూర్తి చేయాలన్నారు. 90 రోజుల హౌసింగ్ కి సంబంధించి ఇంకా 1,24,439 మ్యాన్ డేస్ పూర్తి చేయాల్సి ఉందని, ఉపాధి ఏపీఎంలు హౌసింగ్ ఏఈలతో సమన్వయం చేసుకుని లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. పశువుల షెడ్ లకు సంబంధించి 1,264 మంజూరు కాగా, ఇప్పటివరకు 950 గ్రౌండ్ చేసి 540 పూర్తి చేశారని, 360 పెండింగ్ ఉన్నాయని, వాటిని గడువులోపు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఫారంపాండ్ లకు సంబంధించి 4,508 మంజూరుకాగా, 430 గ్రౌండింగ్ కాగా, మిగిలినవి వేగంగా గ్రౌండింగ్ చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. వ్యక్తిగత సోక్ పిట్లకు సంబంధించి మంజూరైన వాటిని గ్రౌండింగ్ చేయాలన్నారు. ప్లాంటేషన్ కు సంబంధించి మొరింగ ప్లాంటేషన్ పై దృష్టి సారించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి డిఆర్ఓ రామ్మోహన్, కెఆర్సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, సిపిఓ అశోక్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, హౌసింగ్ పిడి శైలజ, డ్వామా పిడి సలీమ్ భాష, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జడ్పి డిప్యూటీ సిఈఓ రామసుబ్బయ్య, జిఎస్డబ్ల్యుఎస్ జిల్లా కోఆర్డినేటర్ ధనుంజయ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా ప్రశ్నించలేని చంద్రబాబు.

మొదటిపేజీ తరువాయి.... చేయమని కేంద్రాన్ని అడగండని. ఏపీ విభజన చట్టంలో హామీలు అమలు చేయమని అడగాలని ఆయన సూచించారు.బడ్జెట్ లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా కూటమి ఎంపీలు ప్రశ్నించలేని అచేతన స్థితిలో ఉన్నారని మండిపడ్డారు.రాష్ట్ర ప్రయోజనాల కంటే అధికారం ఎలా కాపాడుకోవాలి, పోలీసు వ్యవస్థను ఎలా ధ్వంసం చేయాలి, ప్రజల్ని ఎలా భయభ్రాంతుల్ని చేయాలన్న ఆలోచన మాత్రమే ఉందని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి మీరు చేస్తున్న ద్రోహం ఏమిటన్నది అందరికీ అర్థమవుతోందని వాటన్నింటిని కప్పి పుచ్చడానికి వైఎస్సార్సీపీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని ఆయన విమర్శించారు.ఇప్పటికైనా వైఎస్సార్సీపీ నేతలపై దాడుల్ని అడ్డుకుని, రాష్ట్రానికి ఎలా మేలు చేయాలో ఆలోచించాలని శైలజానాథ్ సూచించారు. సమావేశంలో జడ్పిటిసి నీలం భాస్కర్, కాటమయ్య, నాయకులు బోనాల హరికృష్ణ, దీపు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 28 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.15,48,425 ల ఆర్థిక చెక్కులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 231 మందికి రూ.2 కోట్ల 37 లక్షల 73 931 రూపాయలను పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆర్థికంగా ఆదుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ ఇంటి పెద్ద కొడుకుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కంచిసముద్రం రహదారిని వెడల్పు చేయాలని సిపిఐ నాయకుల వినతి

లేపాక్షి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

మండల కేంద్రమైన లేపాక్షిలో కంచిసముద్రం రహదారిని వెడల్పు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సిపిఐ కార్యదర్శి గౌతమ్‌కుమార్, మండల సీనియర్ నాయకులు శివప్పలు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కంచిసముద్రం రహదారి గుండా వందలాది వాహనాలు వెళుతుంటాయన్నారు. భారీ వాహనాలు వెళ్లే సమయంలో పలుమార్లు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. జాతీయ రహదారి అధికారులు దాదాపు ఐదారు సంవత్సరాల క్రితం కంచిసముద్రం రహదారిని వెడల్పు చేసేందుకు కొన్ని ఇళ్లను కూడా తొలగించడం జరిగిందన్నారు. ఈ రహదారి ఇరుగ్గా ఉండడంతో పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయన్నారు. ఇప్పటికైనా కంచిసముద్రం రహదారిని వెడల్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. రహదారి వెడల్పు చేసే సందర్భంలో ఇళ్లు తొలగించాల్సి వస్తే అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు కూడా చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, సుమన్, మూర్తి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బార్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

షాపుల నిర్వాహములతో సిఐ మహేష్ కుమార్

రాయదుర్గం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో మిగిలిపోయిన ఒక మద్యం బార్ ఏర్పాటుకు దరఖాస్తుల కోరుతున్నట్లు ఎక్సైస్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో సాయంకాలం స్థానిక మద్యం బార్లు నిర్వహణకు ఉత్సాహవంతులైన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ నిబంధనలను వివరించారు ఈ మద్యం బారు కాలు పరిమితి 2026 ఫిబ్రవరి5 నుండి ఉత్సాహవంతమైన దరఖాస్తులు టెండర్ లో పాల్గొనేవారు ఐదు లక్షల డిపాజిట్ తో పాటు రూ పదివేల రూపాయలు ప్రాసెస్ ఫీజు కూడా చెల్లించాలని తెలిపారు. మద్యం బార్ కోసం ఎంతమంది అయినా దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 8వ తారీఖున కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా కేటాయించబడుతుందని ఆయన తెలిపారు ఎక్సైజ్ చట్టం ద్వారా నిబంధనలను ఉంటాయని ఆయన తెలిపారు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

పుట్టపర్తి (కల్చరల్), ఫిబ్రవరి 02, ప్రభాతవార్త

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైయస్ఆర్ టి ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంషీద్ , శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి లు జిల్లా విద్యాధికారి కృష్ణయ్యకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. పిఎఫ్ ఎంఎస్ లాగిన్ సమస్యలను పరిష్కరించి ఓహెచ్ లను పాఠశాల మొత్తానికి అందించాలని, ఎస్ఎస్సి డ్యూటీ నుండి వికలాంగులు, 55సంవత్సరాల పైబడివారు, గర్భిణీ మహిళలను, చిన్నపిల్లల తల్లులను మినహాయించాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు సిఎల్ వినియోగించుకొనుటకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, నాడునేడు రెండవవిడత, ఎస్ఎస్సి 100 రోజుల ప్రణాళికలో సెలవు దినాలలో పనిచేసిన వారికి సిసిఎల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రతాప్ రెడ్డి ,రామ్మోహన, మహమ్మద్ అలీ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరవకొండలో అధికమైన వీధి కుక్కలు బెడద..!

-దాడులు చేస్తుండటంతో బయటకు రావాలంటేనే జంకే పరిస్థితి

-పట్టణంలో ఏ కాలనీలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు

-కుక్కల దాడుల్లో గాయపడుతున్న మహిళలు, చిన్నారులు

ఉరవకొండ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్న దృశ్యం

ఉరవకొండ పట్టణంలో వీధికుక్కల బెడద ఇటీవలి కాలంలో అధికమైంది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరగాడుతూ, రోడ్ల మధ్యలో పడుకొంటూ దారివెంట వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. పాదచారులు మొదలు ద్విచక్రవాహనదారుల వరకు సమీపం నుండివెళ్లే ప్రతిఒక్కరిని చూసి మొరుగుతూ భయభ్రాంతులకు గురిచేయడం వారు ఏవైనా వస్తువులు తీసుకెళుతుంటే వాటిని లాక్కొని చిందరవందరచేసి పనికిరాకుండా చేయడం, తినడం నిత్యం చోటు చేసుకునే సంఘటనలుగా చెప్పాలి. కుక్కలకు భయపడి మహిళలు, పిల్లలు బయటకు రావాలంటేనే జంకే పరిస్థితులు నెలకొంటుండగా రాత్రిళ్లు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. రోడ్డుప్రక్కన పడుకొనివున్న కుక్కలు ఒక్కసారిగా దాడి చేస్తుండటంతో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల స్థానిక యూనియన్ బ్యాంకు వెనుకగల సత్యనారాయణ పేటలో పనుల నిమిత్తం బయటకు వెళ్లిన నలుగురు మహిళలను వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఉద్దానపప్ప పాఠశాల సమీపంలోని చిన్న ఆంజినేయస్వామి గుడి ప్రాంతంలో కుక్కలు స్వైర విహారంచేసి గొర్రెలు, ఆవు దూడలపై దాడికి తెగబడి గాయపర్చాయి. పార్కు ఆంజినేయస్వామి గుడి వెనుక, 10వ వార్డు, పాత స్టేట్ బ్యాంకు తదితర కూడళ్లలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని ఇదివరకే అనేకమార్లు విన్నవించినా అధికారుల్లో చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. కుక్కలకు ఎలాంటి హానీ తలపెట్టకుండా ఆహారం, నీరు సంవృద్ధిగా లభించే ప్రదేశాలకు వాటిని తరలించాలని కోరుతున్నారు.

సిపిఎస్ రద్దుపై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి

-జిల్లా అధ్యక్షులు నీలం అశోక్, భాస్కర్‌రెడ్డి

-ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల కమిటీ ఎన్నిక

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

ఏపీసీపీఎస్ఈఏ గోరంట్ల మండల నూతన కార్యవర్గ ఎన్నిక శ్రీశాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో జరిగింది. ఈ ఎన్నికల నిర్వహణకు వ్యవస్థాపకులు పాలేల రామాంజనేయులుయాదవ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడ

పెంచిన భూముల ధరలు తగ్గించి రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలి

- జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్

డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రరం ఇస్తున్న దృశ్యం

శింగనమల, జనవరి 2 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో పెంచిన భూముల ధరలు తగ్గించి రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలని, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం భూముల ధరలు పెంచి క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ ధరలు అమాంతంగా 10 నుంచి 20 శాతం పెంచడం వల్ల పేదలపైన అదనపు భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకుని పెంచిన ధరలను తగ్గించాలని క్రయ విక్రయాలలో చిన్న, సన్నకారు రైతులు పేదలు ఇబ్బందులు పడుతున్నారని, భూముల విలువలు పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం తప్పా చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగం లేదన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు సూర్య ప్రతాప్, ఏఓ అన్వేష్‌కుమార్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మధుయాదవ్, సహాయ కార్యదర్శి చేనేత మధు, రైతు సంఘం మండల అధ్యక్షులు భయన్న, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, మునిస్వామి, రామసుబ్బారెడ్డి, నారప్ప, రూప్లానాయక్, కోనప్ప, రామాంజినేయులు, బాలరెడ్డి, వెంకటేష్‌నాయక్, లక్ష్మిదేవి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఊరి బడిని కాపాడుకుందాం

- ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం : మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

పోస్టర్లను విడుదల చేస్తూ.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

సోమవారం సాయంత్రం ఉపాధ్యాయభవన్‌లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరు అయ్యారు. ఈ సమావేశంలో డాక్టర్ గేయానంద్ చేతులమీదుగా బడిలో విద్యార్థులను చేర్పిద్దాం ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్‌ను విడుదల చేశారు. ఎమ్మెల్సీ డా.గేయానంద్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టి విద్యార్థుల సంఖ్యను పెంచాలని, పాఠశాలలో నైతిక, ఉన్నత విలువ లతో పాటు సామజిక స్పృహ కలిగిన భావిభారత పౌరులు గా ఎదగాలంటే, ప్రాథమిక విద్య చాలా ముఖ్యం అని తెలిపారు. గ్రామాలలో పాఠశాలల ఎన్రోల్మెంట్ పెంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడు కొనే బాధ్యత ప్రతి యుటిఎఫ్ కార్యకర్త తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్య దర్శి దేవేంద్రమ్మ, రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబెర్ రమణయ్య, ప్రధాన కార్య దర్శి ఈశ్వరయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శిలు అర్జున్, సుబ్బారాయుడు, చంద్రమోహన్, ఓబులేసు ఆడిట్ కమిటి కన్వినర్ గంగాధర్, రాష్ట్ర కౌన్సిలర్స్‌లు గోవిందరాజులు, లింగమయ్య సీనియర్ నాయకులు జీలాన్, నాగేంద్ర, వేణుగోపాల్, రామకృష్ణ, మండల నాయకులువీరా చారీ, చంద్రారెడ్డి, గౌస్, ఓబుళపతి వేణుగోపాల్, రామాంజినేయులు, బాబురావు మొదలగు వారు పాల్గొన్నారు.

దళిత నాయకుల హత్యలతో ఉద్యమాలను ఆపలేరు

- దాడులు దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాటం.. సాకే హరి

నిరసన వ్యక్తం చేస్తున్న సాకే హరి తదితరులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

సమానత్వ హక్కుల కోసం న్యాయ పోరాటం చేస్తున్న దళిత నాయకుల దారుణ హత్యలకు మూల్యం తప్పదని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి మండిపడ్డారు. సోమవారం నగరంలోని డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు దళితుల దారుణ హత్యలను ఖండిస్తూ వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలను దరించి నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న దళిత,గిరిజన సంఘాల నాయకులను దారుణంగా చంపుతున్నారని ఆవేదన చెందారు. ఎమ్మార్పిఎస్ఎస్ నాయుకులు టీఎం రమేష్‌ను అతి కిరాతకంగా ట్రాక్టర్ తో గుద్దించి రాడ్లతో విశక్షణరహితంగా దాడి చేసి చంపారని వాపోయారు. దారుణాలు పాల్పడే వారిపై తక్షణం ప్రభుత్వం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు పూసల హనుమంతు, బేడ బుడగ జంగం శిరీశాల అంజి, నాగేంద్ర, ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు కె.చలపతి. నవ యువ సమాఖ్య విశ్వనాథ్. నాగరాజు. జేఏసీ నాయకులు రామకృష్ణ, అజయ్, ఈశ్వరయ్య, రామాంజనేయులు. అది. తదితరులు పాల్గొన్నారు.

బాలిక గర్భం దాల్చిన కేసులో ముద్దాయి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సిఐ నాగేంద్ర

కదిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

బాలిక గర్భం దాల్చిన కేసులో ముద్దాయిని అరెస్టు చేసినట్లు కదిరి రూరల్ సిఐ నాగేంద్ర తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సిఐ తెలిపిన వివరాల మేరకు ఎన్‌పికుంట మండలం యాదాలవాండ్లపల్లికి చెందిన ఎర్రం నీలమ్మ కుమారులు ఎన్‌పికుంట మండలంలోని కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతోందన్నారు. బాలిక తల్లి జనవరి 27న బాలిక గర్భం దాల్చినట్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, తల్లి ఫిర్యాదు మేరకు తాము విచారణ జరపగా బాలిక తండ్రి అక్క కొడుకు వరుసకు బావ అయినన మహేంద్రనే బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ముద్దాయిపై ఫోక్సో చట్టంపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. సమావేశంలో సిబ్బ ంది పాపల్గొన్నారు.

నాడు టిడిపి కూటమి నేతలు సంస్కార హీనంగా మాట్లాడిన భాష మర్చిపోయారా

- వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

నరసింహులు

గతంలో కూటమి నేతలు సంస్కార హీనంగా మాట్లాడిన భాష మర్చిపోయి నేడు సచ్చీనులుగా మాట్లాడుతున్నారని వైసిపి ఎసీ ్ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుపతి లడ్డు విషయంలో కూటమి నేతలు దుష్ప్రచారాలకు పాల్పడ్డారన్నారు. అయితే సిబిఐ, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిట్ లడ్డులలో ఎలాంటి జంతువుల కొవ్వు లేదని నివేదిక ఇచ్చిందన్నారు. నాడు ఇదే అంశంపై ప్రజలను మభ్య పెడుతూ మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ నేడు ఎందుకు ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా జనసేన ఎమ్మెల్యే రాసలీలల బాగోతంపై మరిన్ని అంశాలు వెలుగు చూస్తాయన్న భయంతో బయటికి రావడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్, నారాలోకేష్, అనిత, ఎంఎస్.రాజులు ఒక సీఎం స్థాయి మరిచి మాట్లాడిన మాటలు మర్చిపోయి నేడు అంబటి రాంబాబు, జోగి రమేష్‌లపై మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒక శాసన సభ్యులు అయి ఉండి ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించాల్సిన ఎంఎస్.రాజు తన స్థాయి దిగజారి సంస్కార హీనంగా మీడియా ఎదుట మాట్లాడటం సిగ్గు చేటు అని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా టిడిపి నేతలు లడ్డు అంశంలో ప్రాయశ్చిత్తం పొంది ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

తిరుమల లడ్డుపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి

- మండల వైసిపి నాయకులు!

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో మండల వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను గుర్తించి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సిఐ శ్రీ హర్ష ని కోరారు. ఈ సందర్భంగా మండల ఎంపిపీ చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ కన్వీనర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ..రాజకీయ స్వార్థం కోసం పరమ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ తప్పుడు ప్రచారంతో శ్రీవారి భక్తుల్ని మానసిక క్షోభకు గురి చేసిన నారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్, కూటమి శ్రేణులు తక్షణమే క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూలో ఎటువంటి జంతువుల కొవ్వు కలవలేదని ఎన్‌డిడిబి/ఎన్‌డిఆర్‌ఐ తేల్చేసినప్పటికీ, ఇంకా నిస్సిగ్గుగా పదే పదే అసత్య ప్రచారాలతో భక్తుల మనోభావాలను కూటమి నేతలు గాయపరుస్తున్నారని వారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక భారీ కుట్ర పూర్తిగా బద్దలైంది. అబద్ధాల పునాదులపై, విషప్రచారంతో, చిచ్చును రాజేసి రాజకీయ లాభాలు పొందాలన్న చంద్రబాబు నాయుడు రచించిన కుట్ర చివరకు కూలిపోయింది. నిజం గెలిచి అబద్ధం ఓడిపోయిందని అన్నారు. రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబు కోట్లాది భక్తుల మనోభావాలతో ఆడుకొన్నాడు. చంద్రబాబు ఒక దురుద్దేశంతోనే తన పార్టీ వాళ్ళతో రాష్ట్రవ్యాప్తంగా ప్లెక్సీలు పెట్టడంతో పాటు తిరుమల నెయ్యి వ్యవహారంలో వాళ్ళ కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీబీఐ సీటు దాఖలు చార్జ్ షీటులో మా నాయకుల పేర్లు లేకపోయినాప్పటికీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, వై.వి సుబ్బారెడ్డి ఫోటోలు పెట్టి తప్పుడు ప్రచారాలకు దిగారు అని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు ప్రచారం పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సాకే చంద్ర, చింతకాయల జయన్న, పిట్టి రామంజి, చిరుతల నాగేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా

జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నేతలు

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తే ఓర్వలేక దాడులకు పాల్పడతారా అని వైసిపి నేతలు మండి పడతారా అని మండి పడ్డారు. మాజీ మంత్రులు జోగిరమేష్, అంబటి రాంబాబు నివాసాలపై దాడులను నిరసిస్తూ జిల్లా పరిషత్ ప్రాంగణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట నిరసనను వ్యక్తం చేశారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి, బిసి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ రాష్ట్ర ఎఫ్‌ఈసి సభ్యులు మీసాలరంగన్న, వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు దేవేంద్ర, నగరాధ్యక్షులు లక్ష్మణులతోపాటు పలువురు బిసి నేతలు, పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిసిలపై కూటమి ప్రభుత్వంలో దాడులు అధికమయ్యాయని మండి పడ్డారు. బిసిలపై జరిగిన దాడులు భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగనిస్తున్నామన్నారు. గతంలో రాజుల పరిపాలన చేతకాక ప్రజలను ఇబ్బందులు పెట్టేవారని నేడు అదే రీతిలో హామీలను అమలు చేయలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబునాయుడు మాజీ మంత్రులపైన, నాయకులపైన దాడులు చేయించడం సిగ్గు చేటని మండి పడ్డారు. ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో ప్రజలు మిమ్మల్ని ఎన్నుకుంటే పాలన చేయడం చేతకాక వైసిపి శ్రేణులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. రానున్న రోజుల్లో మీకు ప్రజలే బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నగర నేతలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

ప్రభుత్వ కళాశాల (అటానమస్) అనంతపురంలో పీఎం ఉషా (ప్రధానమంత్రి ఉచ్చితర్ శిక్ష అభియాన్) పథకం కింద డ్రోన్ టెక్నాలజీ పై 50 మంది విద్యార్థులకు, భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమాన్ని 50 మంది విద్యార్థులకు, మైక్రో గ్రీన్ మొక్కల పెంపకంపై 70 మంది విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవ కంపెనీ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ టీ.రాజశేఖర్, ఏరిస్ ఆగ్రో కంపెనీ నుండి కంపెనీ జోనల్ మేనేజర్ శ్రీనివాసులు నాయుడు, రామచంద్ర, నీరజ, కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ, కోఆర్డినేటర్ టీ.జితేంద్ర, డాక్టర్ జయలక్ష్మి, ఇతర అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు ఏరిస్ కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చిరుత పులి సంచారం ప్రజలు అప్రమత్తంగా ఉండండి..ఎమ్మెల్యే శ్రావణీశ్రీ

బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

చిరుత దాడిలో గాయపడిన వారు

బుక్కరాయసముద్రం మండలంలోని సంజీవపురం, నార్పల మండలంలోని బొందలవాడ గ్రామ సమీపంలో చిరుతపులి సంచారం ఉన్నట్లు సమాచారం రావడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ స్పందించి అటవిశాఖ పోలీసులను అప్రమత్తంచేశారు. ఈ సందర్భంగ అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతాల పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చిరుతపునిలి పట్టుకునేందుకు మత్తు ఇంజక్షన్ బృందం బోన్లను సిద్ధం చేసి అటవీశాఖ చర్యలు ప్రారంబించింది. గ్రామ ప్రజలు ముఖ్యంగా రాత్రి వేళల్లో పొలాల వైపు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిరుత దాడిలో గాయపడిన సంజీపురం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి, బొందలవాడ గ్రామానికి చెందిన లక్ష్మిదేవి గాయపడిన వారి పట్ల విచారరం వ్యక్తం చేస్తూ వారికి తక్షణ వైద్య సహాయం అందిస్తున్నా మన్నారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అన్నారు. అటవి శాఖ, పోలీసు శాఖలతో సమన్వయం చేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ న్నామని సంబందిత ప్రాంతల్లో అవసరమైన పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని సూసించారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని జాగ్రతగా ఉండాలన్నారు.

కొండమీదరాయుని తాత్కాలిక హుండీ లెక్కింపు

బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

హుండీలెక్కిస్తూన్న దృశ్యం

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో వెలసిన కొండమీదవెంకట రమణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలు దేవస్థానం నందు సోమవారం దేవరకొండ పైన, గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బట్ట హుండీల ద్వారా దేవాదాయశాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారి బి.సుధారాణి సమక్షంలో హుండీలను లెక్కింపు చేయడం జరిగింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ,3,48,377 రూపాయలు వచ్చిందని శాశ్వత హుండీల లెక్కింపు బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత లెక్కించడం జరుగుతుందని, ఈ మొత్తాన్ని దేవస్థానం అకౌంట్‌కు జమ చేయడం జరుగుతుందని దేవాదయశాఖ ఇవో సాకే రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆలయ ధర్మకర్త నారాయణస్వామి, భవాని సేవా సమితి సభ్యులు, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ ప్రసన్న పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం

- భక్తుల రద్దీతో కిటకిటలాడిన శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం

శ్రీ ప్రసన్న పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం దృశ్యం

పామిడి, ఫిబ్రవరి 02 ప్రభాతవార్త

శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం నందు దేవస్థానం ధర్మకర్తల మండలి కమిటీ సభ్యులు శివదీక్ష స్వాముల ఆధ్వర్యంలో సోమవారం శ్రీ ప్రసన్న పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం వేలాదిమంది భక్తుల మధ్య వైభవంగా జరిగింది. దేవాలయ అర్చకులు మేషల్గమునందు శ్రీ ప్రసన్న పార్వతీ శ్రీ భోగేశ్వరస్వాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలను వల్లిస్తూ శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని చేపట్టారు. కళ్యాణోత్సవానికి విరివిగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టి స్వాముల వారి కృపకు పాత్రలవుతూ తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీ ప్రసన్న పార్వతీ శ్రీ భోగేశ్వరస్వాములను దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల రద్దీతో దేవాలయం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో అలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణయ్య, ధర్మకర్తల మండలి కమిటీ చైర్మెన్, సభ్యులు, అర్చకులు సోమశేఖరశర్మ, రామస్వామి, అనీల్‌స్వామి, చంద్రస్వామి, శివదీక్ష స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో ఇన్ఫినిటీ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త

ప్రతిభ కనపరచిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

హౌసింగ్ బోర్డు, ఆదర్శ్ నగర్‌లోని ఇన్ఫినిటీ పాఠశాల విద్యార్థులు యుఐఈడి (యూనిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్) వారు నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షలో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలో 4వ తరగతి విద్యార్థిని అహనా జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు సాధించడంతో పాటు గీ,నివీ వారి నుండి రూ.1000/ నగదు బహుమతిగా బ్యాంకు చెక్‌ను కూడా పొందింది. అలాగే రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు మొత్తం 5 ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను మెడల్స్ మరియు సర్టిఫికెట్లతో సత్కరించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జె. రాజేశ్వరి గారు, కోఆర్డినేటర్ శ్రీ రామ్మోహన్ రెడ్డి గారు, గీ,నివీ ఇన్‌చార్జ్ శ్రీమతి రేష్మ గారు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామంలోని ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించాలి

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

ఇంటి పన్నులు వసూలు చేస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం ఉప్పర పల్లిగ్రామ పంచాయతీ లో ని ప్రజలందరూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని పంచాయతీ అభివృద్ధి అధికారి వల్ల శంకర్ ప్రజలకు తెలియజేశారు. సోమవారం గ్రామంలోఇంటి పన్నులు మరియు నాన్ టాక్స్ లు వసూలు కోసం మూడు టీమ్ లుగా ఏర్పాటు చేసుకొని 20252026 ఆర్థిక సంవత్సరాల ఇంటి పన్నులు వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ అభివృద్ధి అధికారి వర్ల శంకర్, పంచాయతీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగల అక్కమ్మ గార్ల పరుష

అక్కమ్మ గార్లను దర్శించుకుంటున్న ప్రజలు

అనంతపురం రూరల్ ఫిబ్రవరి 02 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ మండలం రాచంపల్లి గ్రామంలో వెలసిన అక్కమ్మ గార్ల పరుస మహోత్సవ వేడుకలు కన్నుల పండుగలా సాగింది. సోమవారం గ్రామ పెద్దలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అక్కమ్మ గార్ల కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కమ్మ గార్లకు వివిధ పూలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అక్కమ్మ గార్ల దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని అక్కమ్మ గార్ల ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు అందుకున్నారు. పరుష సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు హాజరై అక్క మ్మ గార్ల ను దర్శించుకుని అక్కమ్మ గార్ల ఆశీస్సులుపొందితీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ పరసకు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అక్కమ్మ గార్ల పరుష ను జయప్రదం చేసి అమ్మవార్ల ఆశీస్సులు అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పోలీసులు పరసలో ఎటువంటి సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

స్వామిత్వ సర్వే నిర్వహించిన అధికారులు

- సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి. పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి.

గ్రామంలో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం కురుకుంట గ్రామపంచాయతీలోని ప్రజలందరూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని, అదే విధంగా స్వామిత్వ సర్వే కి ఇంటి వద్దకు వచ్చినప్పుడు ప్రజలు వారి ఆధార్ కార్డు ఇంటి పత్రాలు చూపించి వారి నివాసాలను సర్వే చేయించుకోవాలని పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా మండల అధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వేలతో కలిసి గ్రామంలో స్వామిత్వ సర్వే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, అదేవిధంగా 2025 26 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నుల వసూళ్లు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ రెండు కార్యక్రమాలకు గ్రామాల్లోని ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలి

మట్టి నమూనా పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకుని ఎక్కువమంది వాటిని అనుసరించాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలియ జేశారు. సోమవారం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా ప్రకృతి వ్యవసాయం ఎక్కువమంది రైతులను పాలుపంచుకునే విధంగా రైతుల యొక్క పొలాలలో మట్టి నమూనాలను సేకరించి ప్రభుత్వం యొక్క ఆదేశానుసారంతో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.రవి ప్రకృతి వ్యవసాయ డిపిఎమ్ లక్ష్మణ నాయక్ భూసార పరీక్ష కేంద్రం ఏ డి ఏ రోజా పుష్పలత ఏవో శ్రీనాథ్ రెడ్డి కె రాధమ్మ, ఏవో వెంకట కుమార్ పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హోంగార్డుకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా సన్మానం

04ATP13_04ATP13.qxd 02-02-2026 PM 10:38 Page 1

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోండి

ఆర్ డబ్ల్యుఎస్ ,మున్సిపల్, అధికారులతో మంత్రి సవిత సమీక్ష

మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత..

పెనుకొండ ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త)

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని పెనుకొండ నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఏర్పడితే వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గం లోని 5 మండలాల ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.. అనంతరం పెనుకొండ మున్సిపాలిటీ కమిషనర్‌తో పాటు ఇతర మున్సిపల్ అధికారులతో మంత్రి సవిత మరో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, శానిటేషన్ పనుల పురోగతిపై విస్తృతంగా చర్చించారు.మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు కాపాడాలని, ప్రతి వార్డులో నిరంతర పర్యటనలు నిర్వహించి ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సవిత సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ మరియు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణు చరణ్

అనంతపురం కలెక్టరేట్ ఫిబ్రవరి 02 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణు చరణ్ స్వీకరించారు. అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఇంచార్జి డిఆర్ఓ రామ్మోహన్, ఆర్డీఓలు కేశవనాయుడు, ఏబీవీఎస్బి శ్రీనివాస్, వసంతబాబు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఆనంద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 525 అర్జీలను జిల్లా ఇంచార్జి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నాణ్యతగా అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. రీఓపెన్ అయిన అర్జీలను గడువు తీరకముందే పరిష్కరించాలన్నారు. అర్జీదారులతో అధికారులు స్వయంగా, మంచిగా మాట్లాడాలన్నారు. పిజిఆర్ఎస్ కు సంబంధించి బియాండ్ ఎస్ఎల్ఏలు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. గడువు తీరిన అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచరాదన్నారు. యూనిఫైడ్ పబ్లిక్ సర్వే, అక్షర ఆంధ్ర సర్వేని చేపట్టాలని, జిల్లా వెనుకబడకుండా సర్వేపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ సారించాలన్నారు. ఫిబ్రవరి నెలలో పంపిణీ చేసే పట్టాదారు పాసుపుస్తకాలు 5,681 చేయాల్సి ఉంటే 5,174 వచ్చాయని, వాటిని షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించి పంపిణీ చేయాలన్నారు. ఇవ్వలేని

ప్రజలనుండి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్చార్జి కలెక్టర్

వారికి ఎందుకు ఇవ్వలేకపోతున్నామో ఖచ్చితంగా తెలపాలన్నారు. ఎవరికి రాలేదో వారికి వచ్చే నెల ఇచ్చే అవకాశం ఉంటుందని, అప్పుడు గ్రామ సభలు పెట్టి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి తిమ్మప్ప, జిల్లా వ్యవసాయ అధికారి రవి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, హౌసింగ్ పిడి శైలజ, సిపిఓ అశోక్ కుమార్, డిపిఓ నాగరాజునాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఎల్డిఎం నరేష్ రెడ్డి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, డిసిఓ అరుణకుమారి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డ్వామా పిడి సలీమ్ భాష, డీఈవో ప్రసాద్ బాబు, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, జిల్లా రిజిస్టర్ భార్గవ్, పీఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, చేనేత జౌళి శాఖ ఎడి వరప్రసాద్, సర్వే ఏడి రూప్ల నాయక్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపండి- జిల్లా కలెక్టర్

ట్రై సైకిల్ ను అందిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ , కొత్తచెరువు వద్ద చెరువులోకి మురుగునీరు కలుస్తున్న వైనంను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎసి

పుట్టపర్తి(కలెక్టరేట్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త

ప్రజలు అందించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోనిపిజిఆర్ఎస్ హాలునందు, ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ ప్రజల నుండి 203 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. మూడు చక్రాల వాహనం పంపిణీ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల కార్యక్రమంలో నల్లచెరువు మండలం ఊరవాయి గ్రామానికి చెందిన బి. వెంకట రమనప్ప మూడు చక్రాల సైకిల్ కొరకు దరఖాస్తు చేసుకోగా జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ వెంటనే స్పందించి తక్షణమే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో మూడు చక్రాల సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంచాలకులు అర్చన పాల్గొన్నారు. అలాగే బుక్కపట్నం చెరువులో మురుగునీరు కలుస్తున్న వైనం ను కొత్తచెరువు చెందిన ఎంపీ పావన్న కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు సంబంధిత మురుగు కాలువలను పరిశీలించి చెరువునిటిలో కలవకుండా తగు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలియజేశారు.

పోలీసులకు నాపై ఎందుకీ కక్ష.. లాయర్ సత్యనారాయణ రెడ్డి

30శాతం వాటా ఉంది..నేనేందుకు ఆసుపత్రిలోకి వెళ్లకూడదు

మరోసారి తెరపైకి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వివాదం

డీఐజీ, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన లాయర్ సత్యనారాయణ రెడ్డి

పోలీసు ఉన్నతాధికారులను కలిసి వచ్చిన తర్వాత విలేకరులతో మాట్లాడుతున్న లాయర్ సత్యనారాయణ రెడ్డి

అనంతపురం, ఫిబ్రవరి 2, (ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురం నగరంలో శ్రీనివాస మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 30 భాగస్వామి ఉన్న తనకు ఆసుపత్రిలోకి వెళ్లేందుకు లేకుండా చేస్తున్నారని.. ఇందుకు పోలీసులు కూడా సహకరిస్తున్నారని.. అనంతపురం డీఐజీ, జిల్లా ఎస్పీలకు సోమవారం లాయర్ సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన జిల్లా ఎస్పీ జగదీష్ తో పాటు డీఐజీ షీమోషీని కలిసి తనకు జరిగిన అన్యాయంను వివరించారు. నాపై తప్పుడు కేసు పెట్టి 60 రోజులు జైలుకు పంపారనీ లాయర్ సత్యనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సాయి నగర్ మూడో క్రాస్ లోని శ్రీనివాస ఆసుపత్రి భవనాన్ని నలుగురు భాగస్వాములుగా నిర్మించామన్నారు. కానీ భాగస్వామి డబ్బులు అడిగినందుకు తనపై తోటి భాగస్వాములు తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. ఐదుసార్లు ఎస్పీకి ఫిర్యాదు చేసిన తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు తనపై ఎందుకు కక్షో అర్థం కావడం లేదని.. తాను తీవ్రవాదినో కాదని.. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం సామాన్య కుటుంబం నుంచి వచ్చి లాయర్గా జీవనం సాగిస్తున్న వ్యక్తి అని చెప్పారు. 30 భాగస్వామి ఉన్న తనకు శ్రీనివాస ఆసుపత్రిలోకి వెళ్లడానికి హక్కు లేదా అనే ప్రశ్నించారు.

చేసిన మంచిని ప్రజలకు తెలిసేలా చెప్పండి

- నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో

19నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నా.. ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లడం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గం లోని మొత్తం 26మందిలబ్ధిదారులకు 41లక్షల 95వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు. చెక్కులు అందుకున్నవారు ఎమ్మెల్యేసునీతకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 19నెలల కాలంలో 8కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ కింద ప్రజలకు సాయం అందించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందినవారు ఆర్థికంగాఇబ్బంది పడుతున్నారన్నారు. గతప్రభుత్వంలో కనీసం 10శాతంమందికికూడా సాయం అందలేదన్నారు. చాలామంది కనీసం 20వేలుసాయంచేసినా తమకు ఉపయోగపడుతుందన్న ఆశతో ఉన్నారన్నారు. అందుకే ఇలాంటి వారి కోసం ఎన్ని సార్లైనా ముఖ్యమంత్రి, అధికారుల వద్దకు వెళ్తున్నానన్నారు. అయితే మనం ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నా, గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నా.. దానిగురించి పక్క గ్రామానికి కూడా తెలియడం లేదన్నారు. నాయకులు, కార్యకర్తలతో పాటు సాయం పొందిన వారు కూడా పలువురికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. మనం సంక్షేమాన్ని, అభివృద్ధిని ఎక్కడా ఆపడం లేదన్నారు. అయితే నాయకులు, కార్యకర్తలు దానినిప్రజల్లోకి తీసుకెళ్లడంలోనే వెనుకబడ్డారన్నారు. ఇక నుంచి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త దీని మీద దృష్టి సారించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. పీఏబిఆర్ కుడికాలువ పరిధిలోని చెరువులన్నింటికీ నీరు ఇవ్వండి.

ఇంకెన్నాళ్లు..ఇలా వదిలేస్తారు..?!

- ప్రారంభానికి నోచుకోని పారసరఫరాల శాఖ గిడ్డంగులు

- రూ.42 లక్షలతో నిర్మించి సంవత్సరాలుగా వదిలేసిన వైనం

- మార్కెట్ యార్డులో అద్దె గోదాముల్లో ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వహణ

ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ప్రక్కన నూతనంగా నిర్మించిన పౌరసరఫరాలశాఖ మండల గిడ్డంగుల ముళ్ల పొదల మధ్య వున్న దృశ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల పక్కన నిర్మించిన పౌరసరఫరాలశాఖ మండల గిడ్డంగులు ప్రారంభానికి నోచుకోవడంలేదు. ఒక్కొక్క గిడ్డంగిను 21 లక్షల రూపాయల వ్యయంతో 500 మెట్రిట్ టన్నుల నిలువ సామర్థ్యంతో రెండు గిడ్డంగులను నిర్మించి సంవత్సరాలు గడిచిపోతున్నా వాటిని ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మార్కెట్ యార్డులోని గోదాములను అద్దెకు తీసుకొని ఎంఎల్ఎస్ పాయింట్‌ను నడుపుతున్న పౌరసరఫరాలశాఖ నిర్మాణం పూర్తి అయి సంవత్సరాలు గడిచిపోయి ప్రారంభానికి ముందే పాడవుతున్న గిడ్డంగులను వినియోగించుకోవడానికి ఎందుకు చర్యలు చేపట్టడంలేదో అర్థంకాని పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. కాగా నూతనంగా నిర్మించిన గిడ్డంగులకు ఆనుకొనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలను సైతం పంపిణీ చేసింది. ఇటీవలి కాలంలో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నా పౌరసరఫరాలశాఖ అధికారులు మాత్రం గోదాములను వినియోగించుకోవడానికి ముందుకు రాకపోవడం విశేషం.

పద్మశాలీయ బహుత్తమ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

కమిటి సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరంటౌన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

పట్టణంలోని మార్కండేయ ఆలయంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో గతనెల 27 నుంచి 28 వతేదీ వరకు ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలను జయప్రదం చేసినందుకు సహకరించిన ఆసంఘం అధ్యక్షులు పుత్తారుద్రయ్య, ఉపాధ్యక్షులు జింకానాగభూషణ, ప్రధాన కార్యదర్శి మెటికల బాలకుళ్లాయప్ప, కోశాదికారి వడుకల భాస్కర్, సహాయ కార్యదర్శులుపోలంకి వెంకటరామయ్య, పోలంకి లక్ష్మీనారాయణ, బుదారపు శ్రీనివాసులతో పాటు కమిటిసభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆలయకమిటి సభ్యులు ఐక్యంగా ఉంటూ ఆలయ అభివృద్ధిఖి సహకరిస్తూ ఏ కార్యక్రమాలు జరిగిన కలిసికట్టుగా విజయవంతంచేయాలని ఆసంఘంఅధ్యక్ష, ఉపాధ్యక్షులు తెలిపారు.

సిద్దావధూత స్వామిను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

- ఆలయంలో ప్రత్యేక పూజలు, షాలువాకప్పి సన్మానించిన మఠాధిపతి

ఉరవకొండ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో వెలిసిన సిద్దావధూత స్వామివారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సిద్దావధూతల వారి రథోత్సవం జరుగనున్న సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. ఈ సందర్భంగా మఠాధిపతి గురులింగప్పస్వామి ఆయన్ను షాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యం.నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్ గౌడ్, గ్రామ సర్పంచ్ వీరాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సి.పి.వీరన్న, ఎం.బసవరాజు, కౌడికి గోవిందు, నాగప్ప, గందోడి మారేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సిద్దావధూత స్వామిను దర్శించుకొంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వృత్తి విద్యలో నైపుణ్యత పెంపొందించుకోండి

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త

వృత్తి విద్యలో మహిళలు నైపుణ్యత పెంపొందించుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి మునిసిపాలిటీ లోని బ్రాహ్మణపల్లి ప్రవేట్ పాఠశాలలో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శాంతిప్రియ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రధాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు జీవితంలో సొంత కాళ్లపై నిలబడి కుటుంబాన్ని పోషించగలిగే శక్తి సామర్థం కలుగుతుందన్నారు. కేవలం 30 రోజుల్లో టైలరింగ్, బ్యూటిఫికేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొంది ఆయా రంగాల్లో రాణిస్తూ జీవితాలకు ఉపాధి పొందాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలంటే ఒక లక్ష్యం తో ముందుకు వెళ్లి కష్టపడి పనిచేస్తే తగిన ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

కోరారు.మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో అత్యంత ప్రతిభను కనబరుస్తూ పురుషులకు దీటుగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణ పొందిన మహిళలు ఆయా వృత్తుల్లో ప్రత్యేక నైపుణ్యం సాధించాలని అన్నారు. మంచి లాభదాయక ఉపాధి మార్గాలను ఎంచుకొని జీవితాల స్థితి గతులు మార్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ నీలకంఠ రెడ్డి, సంస్థ శిక్షణ నిర్వకులు,శిక్షణ పొందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమిలినేని సమక్షంలో టీడీపీలో చేరిన కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ ఉద్దిప్ సింహా

ఉద్దిప్ సింహాతో పాటు 50 మంది యువత, మల్లికార్జునపల్లికి చెందిన 14 కుటుంబాల టీడీపీ చేరిక

కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు

కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ ఉద్దిప్ సింహ పార్టీలో చేరుతున్న దృశ్యం , మల్లికార్జునపల్లి గ్రామస్తులు పార్టీలో చేరుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతందిశగా రాజకీయవలసలుకొనసాగుతు న్నాయి. టీడీపీ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. కళ్యాణదు ర్గం ప్రజావేదికలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు - వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గడుపుడి నారాయణ స్వామి చేతుల మీదుగా విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ ఉద్దిప్ సింహాతో పాటు 50 మంది యువత తెలుగుదేశంపార్టీలోచేరారు.అలాగే కళ్యాణదుర్గం రూరల్ మండలం మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ యాదవ బూదెప్ప, పెద్దింటి శివచిత్త, గొల్ల ప్రభాకర్, పెద్దింటి బొజ్జప్ప, పెద్దింటి శివచిత్తప్ప, యాదవ ధనుంజయ, గొల్ల బోరప్ప, పెద్దింటి మలింగ, పెద్దింటి సుధాకర్, పెద్దింటి బొజ్జప్ప (మున్నా), పెద్దింటి చిత్తప్ప, పెద్దింటి జలంధర్, పెద్దింటి శీనప్ప, యాదవ తరుణ్ తదితరులతో కలిపి 14 కుటుంబాలు పసుపు కండువాకప్పుకుని టీడీపీలోచేరాయి. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వ్యాఖ్యలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త మరింత కృషి చేయాలి. కష్టపడి పనిచేసే ప్రతిఒక్కరికీ పార్టీలో మంచిగుర్తింపు ఉంటుంది. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ నాకు శ్రేయోభిలాషులే. నేనూ ఒక కార్యకర్తగానే పనిచేస్తాను" అని తెలిపారు. స్త్రీ శక్తి నిధుల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు మల్లికార్జునపల్లి గ్రామంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక నాయకుడు మహిళా సంఘాలకు అందాల్సిన స్త్రీ శక్తినిధులను దుర్వినియోగం చేసిన ఘటనతో మహిళలు బ్యాంకుల వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధుల దుర్వినియోగం నేపథ్యంలో 18 మహిళా సంఘాలను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లోకి చేర్చిందని వెల్లడించారు. ఈవిషయాన్ని ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లగా ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు, త్వరలోనే నిజాలు వెలికితీసి నగదు రికవరీ చేసి మహిళా సంఘాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.ఈకార్యక్రమంలో రాష్ట్రవాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్, మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి సోమశేఖర్, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ళ వెంకటేషులు, బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు అమరా రామ్మోహన్ చౌదరి, పార్లమెంట్ కార్యదర్శి షామీర్, మాజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ డీకే రామాంజనేయులు, తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి అనిల్ చౌదరి, సింగిల్ విండో అధ్యక్షుడు మల్లిపల్లి నారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టర్లు కుబేర్ యాదవ్, ధను నాయక్, దొణస్వామి, గురుప్రసాద్, కామక్కపల్లి నాగరాజు, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, గోళ్ళ బొజ్జన్న, ఆకుల రహిమాన్, ఇటుకల రామాంజనేయులు, మునీర్, గోపాల్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

59 మంది స్వర్ణకారులకు పిఎంఏవై గృహ మంజూరు పత్రాలు పంపిణీ

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని 59 మంది స్వర్ణకారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు నిర్మించుకునేందుకు వంజూరైన పత్రాలను సోమవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వర్ణకారులందరికి ఆటోనగర్ సమీపంలో అప్పట్లో ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వారిలో అర్హులైన 59 మంది ఇళ్లు నిర్మించుకునేందుకు ఒక్కొక్కరికి 2.50లక్షల రూపాయల చొప్పున 1.47కోట్ల రూపాయలను ఎమ్మెల్యేజె.సి అశ్మిత్ రెడ్డి అధికారులతోమాట్లాడి రుణాలుమంజూరు చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జె.సిఅశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ తమకుటుంబం స్వర్ణకారుల అభివృద్ధికోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. స్వర్ణకారుల కుటుంబాలు తమకు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నాయని వారి సహకారం మరువలేనిదన్నారు. అనంతరం స్వర్ణకారులు జె.సి అశ్మిత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ

గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

కార